
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 26 నవంబర్ 2024
5
తూర్పుగోదావరి



సివిల్స్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం బిసి స్టడీ సర్కిల్‌లో నవంబర్ 27 బుధవారం స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు బిసి స్టడీ సర్కిల్ సంచాలకులు కెఎన్.జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని ఆరు జిల్లాలకు సంబంధించి సివిల్స్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు స్క్రీనింగ్ పరీక్షలకు హాజరు కావాలన్నారు. విజయవాడలో నిర్వహించనున్న సివిల్స్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న ఉఅభ్యర్థులందరూ స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కావాలన్నారు. రాజమహేంద్రవరంలోని బిసి స్టడీ సర్కిల్‌లో ఈ నెల 27న ఈ పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డులతో ఉదయం 10 గంటలకు హాజరవ్వాలన్నారు

మోత... రోత

- పరిమితి మించుతున్న వాహన శబ్దాలు
- విచిత్రమైన హారన్లతో బైకులపై ఆకతాయిల ఆగడాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పట్టణ కేంద్రాల్లో జనావాసాల మధ్య వాహనాల శబ్దం హద్దులు మీరుతోంది. కొంతమంది యువత విచిత్ర హారన్ లు వినియోగించడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనాలనుంచి ఆటోల వరకు కొందరు ఆకతాయిల చేష్టలవల్ల ప్రజలు హడలెత్తుతున్నారు. పిల్లి అరుపు నుంచి పిల్లాడి ఏడుపు వరకు.. కుక్క మొరిగినట్టు, నక్క మూలిగినట్టు, పులి గాండ్రించినట్టు ఇలా ఒకటేంటి రకరకాల హారన్‌లు, విసిగిపోయే సైరన్లతో ఆకతాయిలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. నిత్యం జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో విచిత్రమైన శబ్దాలు చేస్తూ జనాన్ని విసిగిస్తున్నారు. జనంలో బుల్లెట్‌పై మక్కువ తెలిసిందే. వాస్తవానికి బుల్లెంట్ బండి కంపెనీతో వచ్చే సైలెన్సర్‌లో శబ్దస్థాయి చాలా తక్కువగా ఉంటుంది. కానీ వాటిని కొనుగోలు చేసినవారిలో చాలామంది తర్వాత భారీ శబ్దం వచ్చే సైలెన్సర్‌లు అమర్చుతున్నారు. వాహనాల నుంచి పరిశ్రమల వరకు శబ్దానికి సంబంధించి



ట్రాఫిక్ పోలీసుల స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లు

పరిమితులు ఉన్నప్పటికీ అధికారులు వాటిని పట్టించుకోకపోవడం, ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో ఎవరికి వారు ఇష్టారీతిన శబ్దకాలుష్యానికి కారకులుగా మారుతున్నారు.

పర్యావరణ పరిరక్షణ నిబంధనల ప్రకారం ప్రతి వాహనానికి పలు పర్యావరణ నిబంధనలు ఉన్నాయి. 1986 పర్యావరణ నిబంధనల ప్రకారం ద్విచక్రవాహనం నుంచి ట్రాక్టర్ వరకు ప్రతి మోటారు వాహనానికి శబ్ద నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే. సైలెన్సర్ తప్పనిసరిగా ఉండాలి. వాహనం తీసుకున్న ఆరు నెలల వరకు 90 డెసిబుల్స్ బైస్టాండర్స్ పోజిషన్, 100 డెసిబుల్స్ ఆపరేటర్ లెవల్స్ ఉండాలి. రెండున్నర సంవత్సరాల తర్వాత 88 డెసిబుల్స్ బైస్టాండర్స్ పొజిషన్, 98 డెసిబుల్స్ ఆపరేటర్ లెవెల్స్ ఉండాలి. కానీ కొందరు ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టం వచ్చినట్టుగా వాహనాలకు సైలెన్సర్లు మారుస్తూ శబ్ద కాలుష్యానికి కారకులవుతున్నారు.

ఆటోవాలాలు తమకు నచ్చిన హారన్ వాడుతున్నారు. అంతేకాకుండా కొందరు ఆటోవాలాలు నిబంధనలకు విరుద్ధంగా తమ ఆటోల్లో మ్యూజిక్ స్పీకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. అదేవిధంగా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో జనవాసాలు మధ్యనే కొన్ని పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. వాటి నుంచి వచ్చే శబ్దాలతో ఆయా ప్రాంతాల్లోని గృహాల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సదరు పరిశ్రమల నిర్వాహకుల నుంచి కొందరు అధికారులకు మామూళ్ల వెళ్తున్నాయనీ, అందువల్లనే అలాంటివాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

శబ్ద స్థాయి ఉండాలిలా...

వాహనాల వారీగా వచ్చే శబ్దాల స్థాయివాహనం శబ్దస్థాయి (డెసిబుల్స్‌లో)మోటారు వాహనాలు త్రీవీలర్స్ 80పాసింజర్, కార్లు 82పాసింజర్, కమర్షియల్ వాహనాలు(4 ఎంటీ వరకు) 85పాసింజర్, కమర్షియల్ వాహనాలు(4 నుంచి 12ఎంటీ వరకు) 89పాసింజర్, కమర్షియల్ వాహనాలు(12 ఎంటి కంటే ఎక్కువ) ఉండాలి. 91 రాష్ట్ర పోల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిబంధనల ప్రకారం ప్రాంతాల వారీగా శబ్దం ఉండాల్సిన డెసిబుల్ స్థాయి...పారిశ్రామిక ప్రాంతంలో 75.00 నుంచి 70.00 ఉండాలి. వాణిజ్య ప్రాంతంలో 65.00 55.00 డెసిబుల్స్ ఉండాలి. నివాసప్రాంతంలో 40.00 నుంచి 55.00 ఉండాలి. నిశబ్ద ప్రాంతం 50.00 నుంచి 40.00 లోపు ఉండాలి.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

స్పెషల్ డ్రైవ్ నిర్వహించి శబ్ద కాలుష్యం చేస్తున్న 100 బుల్లెట్ వాహనాలను గుర్తించి వాహన దారులకు కౌన్సిల్లింగ్ ఇచ్చాం. ఆయా వాహనాల సైలెన్సర్లను వారి ద్వారానే తొల గించాం. జీవోఎంఎస్ నెం.172 ప్రకారం చర్యలు తీసుకుంటాం. వాహనదారులతో పాటు అధిక శబ్దము వచ్చే సైలెన్సర్లను అమ్మిన షాపులపైనా, బిగించిన మెకానిక్ షాపులపైనా చర్యలు తీసుకుంటాం. పోలీసులకు సహకరించండి. అధిక శబ్దాలు వచ్చే సైలెన్సర్లను నియంత్రించండి.

- మహ్మద్ నబీ, ఇన్‌స్పెక్టర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, రాజమండ్రి

కొత్త ఓటర్ల నమోదును పక్కాగా నిర్వహించాలి

ఓటర్ల జాబితా అబ్జర్వర్ నాయక్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని ఓటర్ల జాబితా అబ్జర్వర్ ఎంఎం నాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి ఎస్ఎస్ఆర్-2025 ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై ఇఆర్ఒలు, నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా ఎంతో కీలకమైందన్నారు. అటువంటి జాబితా రూపకల్పనలో ఎటువంటి తప్పులకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న నెల రోజుల సమయంలో దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ మేరకు బిఎల్ఒలతో ఇఆర్ఒలు సమావేశం నిర్వహించాలని చెప్పారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబిత రూపకల్పనకు బిఎల్ఒల సేవలను వినియోగించు కోవాలన్నారు. జిల్లాలో 18-20 ఏళ్ల వయస్సు కలిగిన యువతను ముఖ్యంగా డిగ్రీ కళాశాల విద్యార్థులను నూతన ఓటర్లుగా చేర్పించడంపై దృష్టి సారించాలన్నారు. ఓటర్ల జాబితాలో లాజికల్, డెమోగ్రాఫికల్ పొరపాట్లు ఉంటే వాటిని పూర్తిస్థాయిలో సవరించాలన్నారు. ఓటర్ల జాబితా సవరణలో ఒకటికి రెండుసార్లు క్షుణంగా పరిశీలించాలన్నారు. ఓటర్ల జాబితా తయారీ సమయంలో ఇపి రేషియో, జండర్ రేషియో అంశాల్లో ఉన్న వ్యత్యాసాలను పరిశీలించుకోవాలన్నారు. ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయపక్షాల ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయాలన్నారు.

కలెక్టర్ ప్రశాంతి మాట్లాడూతూ జిల్లాలో 2025 ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పవర్



సమావేశంలో మాట్లాడుతున్న అబ్జర్వర్ నాయక్

పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా అంశాలను వివరించారు. జిల్లాలో ఒక పార్లమెంట్ నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజవర్గాలులో మూడు అర్బన్, 18 మండలాలు ఉన్నాయని, 7 మంది ఇఆర్ఒలు ఉన్నారన్నారు. ఓటరు జాబితాకు సంబంధించి అక్టోబరు 29 నాటికి 16,20,636 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. వారిలో 7,91,086 మంది పురుషులు ఉండగా 8,29,456 మంది మహిళలు, 124 మంది ఇతరులు ఉన్నారన్నారు. జిల్లాలో 1,581 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని వాటన్నింటిని పరిశీలించామనా్ఉ.జిల్లాలో 2025 ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఈనెల 9,10 మరియు 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. డిసెంబరు 24 నాటికి క్లైయిమ్‌లు పరిష్కరిస్మాన్నారు. తుది జాబితాను 2025 జనవరి 6న ప్రకటిస్తామని తెలిపారు. తొలుత అబ్జర్వర్ ఎం.ఎం.నాయక్‌కు కలెక్టర్ పి.ప్రశాంతి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కేతన్ గార్గ్, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, ఆర్‌డిఒ కృష్ణనాయక్, రాణిసుస్మిత, ఆర్‌వి.రమణనాయక్, కెఎల్.శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తి ప్రచారం

ప్రజాశక్తి - రౌతులపూడి

ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి సోమవారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తనకు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. గత 25 సంవత్సరాలుగా ఉపాధ్యాయులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిపిఎస్ రద్దు కోసం శ్రీకాకుళం నుంచి విజయవాడ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించానని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం జరిగే పోరాటాల్లో తాను ముందుంటానని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం పిడిఎఫ్‌తోనే సాధ్యమని అన్నారు. కాలేజీలో కాంట్రాక్టర్ లెక్చరర్ సంబంధించి క్రమబద్ధీకరణ జీవో నెంబర్ 114ను అమలు చేయాలని, అంతేకాకుండా ఎయిడెడ్ కళాశాలలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించడం మరియు బడ్జెట్లో నిధులు కేటాయింపు, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలోనూ పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టడం వంటి సమస్యలపై శాసనమండలిలో పోరాటం చేస్తానని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం జరిగే పోరాటాల్లో అగ్రభాగాన ఉంటానని అన్నారు. ఈ పర్యటనలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు కేరుప్రోలు హరిబాబు, నాయకులు నాగరాజు పాల్గొన్నారు.



ఓట్లను అభ్యర్థిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి

స్త్రీ హింస వ్యతిరేక దినం సందర్భంగా ర్యాలీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



స్త్రీ హింస వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా సోమవారం అవగాహన ర్యాలీ, ఫుట్ పెట్రోలింగ్‌ను మహిళా రక్షక్ పోలీసులు నిర్వహించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు కోటగుమ్మం నుంచి మెయిన్ రోడ్ మీదుగా కోటిపల్లి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ, ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి నరసింహకిశోర్ మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న హింసపై అవగాహన పెంచడం, హింసకు నిరసన తెలపడం, మహిళల రక్షణ కోసం శక్తివంతమైన చర్యలు తీసుకోవడంపై ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలు, యువత, విద్యావంతులైన వారు మహిళలకు మద్దతు ఇస్తూ, సమాజంలో మార్పులు తీసుకురావాలని అన్నారు. మహిళలపై హింస నివారణకు అందరూ కలసి పనిచేయడం అత్యంత అవసరమని అన్నారు.



సుధాకర్ ఎన్నిక పట్ల పలువురు హర్షం

ప్రజాశక్తి - పెరవలి

రాష్ట్ర బహుజన్ లాయర్స్ ఫొరం ప్రధాన కార్యదర్శిగా వెన్నపు సుధాకర్ ఎన్నికవ్వడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 24న విజయవాడ మారుతి ఫంక్షన్ హాల్లో జరిగిన రాష్ట్ర బహుజన్ లాయర్స్ ఫోరం ప్రథమ వార్షికోత్సవం కార్యక్రమం రాష్ట్ర అధ్యక్షులు నారాయణప్ప అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పెరవలి మండలం కానూరు గ్రామానికి చెందిన న్యాయవాది వెన్నపు సుధాకర్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్ను కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ జిల్లా జడ్జిలు గుర్రప్ప కష్టప్ప బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.పరంజ్యోతి రిటైర్డ్ డిజిపి ప్రస్తుతం బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పూర్ణచంద్ర రావు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ న్యాయవాదుల సమస్యలపై బహుజన లాయర్స్ ఫోరం పోరాటం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. రాబోయే రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికల్లో బిఎల్‌ఎఫ్ పోటీ చేస్తుందన్నారు.

సైన్స్ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంచుకునేందుకు, నూతన ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా సైన్స్ విజ్ఞాన కేంద్రం ఉపయుక్తంగా ఉంటుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం బొమ్మూరులో నూతనంగా నిర్మించిన సైన్స్ విజ్ఞాన కేంద్రాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని బొమ్మూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సైన్స్ విజ్ఞాన కేంద్రాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ సుసత్యరేఖతో కలిసి సైన్స్ విజ్ఞాన కేంద్రంలోని అన్ని విభాగాలను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులు తమ విజ్ఞానాన్ని మరింతగా పెంచుకునేందుకు రాజమహేంద్రవరం సైన్స్ సెంటర్‌లో సాంకేతిక పరమైన అంశాలతో ముడిపడి 18 ప్రదర్శనలు ఉన్నాయన్నారు. ఓపెన్ గ్రౌండ్‌లో సైన్స్ పార్క్ ఉందన్నారు.



సైన్స్ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రన్‌నియెన్స్ గ్యాలరీలో ఫిజిక్స్, మ్యాథ్స్‌కి సంబంధించి 33 విజ్ఞాన అంశాలు ఉన్నాయని తెలిపారు. అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన నిర్మాణాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఎడ్యుకేషనల్ సెమినార్లు మరియు సైన్స్ వర్క్‌షాప్‌లను నిర్వ హించడానికి ఈ విజ్ఞాన కేంద్రం ఉపయోగ పడుతుందని తెలిపారు. వాటర్ వర్రీస్ గ్యాలరీలో వర్చువల్ మ్యూజియం, 35 ప్రదర్శనలు ఉన్నాయన్నారు. "అజర్నీ విత్ లైట్"పై ఎగ్జిబిషన్‌లో స్పేస్, గెలాక్సీ, సౌర వ్యవస్థ, గ్రహాలతో కూడిన 20 ప్యానల్స్ ఉన్నాయన్నారు. భారత ప్రభుత్వం, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ మ్యూజియం కోల్‌కత్త వారి సహకారంతో ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నామన్నారు. రోబోటిక్స్ కోసం ఒక ల్యాబ్‌ని ఏర్పాటు చేశామన్నారు. వివిధ రకాల రోబోలు తయారు చేయడానికి డిగ్రీ చదివిన విద్యార్థులకు శిక్షణ ఇస్తామనఆరు. ఇన్నోవేషన్ హబ్ అనేది వినూత్న మరియు సజనాత్మక కార్యకలాపాలకు సంబంధించినదని, ఇందులో 51 అంశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.సురేష్ కుమార్, ఎంపిడిఒ డి.శ్రీనివాస్ రావు, పంచాయతీ రాజ్ అధికారి ఆర్‌డికె.ఆర్మ్ స్ట్రాంగ్, సైన్స్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ మేక సుసత్యరేఖ, ఫీల్డ్ ఆఫీసర్, వై.దుర్గేష్, టెక్నికల్ అసిస్టెంట్ అజయ్ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి చిన్నరాముడు, కెప్టెన్ సత్యప్రసాద్

సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ డాక్టర్ సత్యప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడులతో కలసి సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సాయుధ దళాల పతాక దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబరు 7న నిర్వహిస్తారన్నారు. సాయుధ దళాలు దేశరక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తాయన్నారు. వారు అనునిత్యం దేశ భద్రతకు సంబంధించి పాటుపడతారన్నారు. వారి సంక్షేమం, వారి కుటుంబాల సంక్షేమం కోసం ఫ్లాగ్ డే సంధర్భంగా విరాళాలు అందించాలన్నారు.

లింగ వివక్షతపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఉంద్రాజవరం

లింగ వివక్షత చూపరాదని మండల తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ సూచించారు. సోమవారం వెలుగు కార్యాలయంలో ఎపిఎం టి.బాలకోటయ్య అధ్యక్షతన నిర్వహించిన లింగ వివక్షత పై అవగాహనా సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపిడిఒ వివివి.రామారావు మాట్లాడుతూ లింగ వివక్ష లేకుండా చేయడానికి దీర్ఘకాలిక ప్రచారం చేపట్టాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శర్మ, సిసిలు ఎ.సుబ్బారావు, వి.నాగమణి, జి.మణికుమారి, కేర్ టేకర్ మంగ తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజలను ఏకతాటిపై నడిపేది రాజ్యాంగమే...

ప్రజాశక్తి- కడియం

భారతీయులను ఏకతాటిపై నడిపించే పవిత్ర గ్రంథం భారత రాజ్యాంగమని డిఇఒ కె.వాసుదేవరావు అన్నారు. 75వ రాజ్యాంగ దినం సందర్భంగా గొల్లపల్లి సత్యనారాయణ కడియం మండలంలోని 9 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం రాజ్యాంగంపై డిజిటల్ క్విజ్‌ని నిర్వహించారు. కడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు వి.లావణ్య, ఎ.సంతోషిని ప్రథమ స్థానం, వీరవరం విద్యార్థులు సిహెచ్‌విడి.మణికంఠ, కెవిఎల్.స్పందన ద్వితీయ స్థానం, వేమగిరి విద్యార్థులు ఎ.భార్గవి, ఎస్.జ్యోతి ప్రసన్న తతీయ స్థానాలు సాధించారు. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వై.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎస్.శ్రీనివాస్, పి.శ్రీవెంకటదుర్గ, సువర్ణవేణి పాల్గొన్నారు.

పిజిఆర్‌ఎస్‌లో 144 అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)లో 144 అర్జీలు స్వీకరించామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జెసి ఎస్.చిన్నరాముడు, డిఆర్ఒ టి.సీతారామమూర్తిలతో కలిసి ఆమె అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను గడువులోగా వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలని, ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పరిశీలన చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. డిఆర్ఒ పర్యవేక్షణ చేయాలన్నారు. డిసెంబర్ 4,5 తేదీల్లో కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉంటుందని అందుకు సంబంధించి మొదటి 100 రోజులు లక్ష్యాల ప్రగతి, రెండో 100 రోజుల శాఖల వారీ చేపట్టి పూర్తి చేసిన ప్రగతి నివేదికలు అందించాలన్నారు. డిసెంబర్ 5న నిర్వహించనున్న తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రక్రియను



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి


సంబంధించి మండల వారీగా పోలింగ్‌లో పాల్గొనే టీచర్ల జాబితాను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సంబంధిత విధులు నిర్వహించే అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ టి.సీతారామమూర్తి, సిపిఒ ఎల్.అప్పలకొండ, జిల్లా సహకార అధికారి శ్రీరాములునాయుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరప్పాడులో మెడికల్ సర్వే

ప్రజాశక్తి-పెరవలి

పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్నవరప్పాడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ ఎ.విజయకుమార్‌ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటా మెడికల్ సర్వే నిర్వహించారు. కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి కేన్సర్, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పి.స్పందన, ఎఎన్‌ఎం నీలిమ, టి.మేరి, ఆదిలక్ష్మి, అచ్చయ్యమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఘనంగా రాజ్యాంగ దినోత్సవ పోటీలు

ప్రజాశక్తి - సీతానగరం

సోమవారం సీతానగరం స్థానిక పువ్వాడ సత్యమాంబ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి జాతీయ రాజ్యాంగ దినోత్సవం పోటీలను నిర్వహించారు. వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్, రన్నింగ్, పాటలు తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల నుండి 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రన్నింగ్(బాలురు) సీతానగరానికి చెందిన ఎ.మధునాగసాయి. వంగలపూడికి చెందిన టి.సూర్యకిరణ్ చిన కొండేపూడికి చెందిన జి.హర్షవర్ధన్ బాబు, బాలికల విభాగంలో సితానగరానికి చెందిన పి.బాలశ్రీదుర్గా, ఎం.పాప, వెదుళ్లపల్లికి చెందిన డి.రమ్యభారతి, పాటల పోటీల్లో చిన కొండేపూడికి చెందిన సిహెచ్.అలేఖ్య, బి.మహేశ్వరి, వెదుళ్లపల్లికి చెందిన జి.సునంద, వ్యాసరచనలో సీతానగరానికి చెందిన సిహెచ్.తనూజ, సిహెచ్.మహిమప్రభావతి, వెదుళ్ల పల్లికి చెందిన ఎ.సంజన వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. క్విజ్‌లో రఘుదేవపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టు విజేతగా నిలిచింది. వక్తృత్వంలో రఘుదేవపురానికి చెందిన సాయిసత్యగణేష్, సీతానగరానికి చెందిన ఎ.హారిక, రఘుదేవపురానికి చెందిన కెవరుణ్ విజేతలుగా నిలిచారు. డిబేట్‌లో వెదళ్లపల్లికి చెందిన టి.జాహ్నవి, ఎంఎన్.లలిత విజేతలుగా నిలిచారు. ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కన్నూరి సతీష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ పోటీల్లో పీడీ సింహాద్రి, శంకర్‌రావు, ఎడి ప్రసాద్, శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు ఎంవివి.ప్రసాద్, రాజేష్, బ్రహ్మాజీ, విజయ్ కుమార్, సిఆర్‌పి ప్రసాద్, చంటిబాబు, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.



వివిధ పోటీల్లో విజేతలతో నిర్వాహకులు



వృత్తి పాఠాలు చెబుతున్న తాపీమేస్త్రీ సూరిబాబు

తాపీ మేస్త్రీతో విద్యార్థులకు వృత్తి పాఠాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక నాగరాజా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బోధనలో ప్రత్యేక పద్ధతులు అవలంబిస్తారని తెలిసిందే. అయితే విద్యార్థులకు మరింత వివరంగా విషయాన్ని తెలియ జేసేందుకు ఆమె మరో ప్రయోగం చేశారు. 4వ తరగతి పరిసరాల విజ్ఞానంలో 'వృత్తులు -వారి సేవలు' గురించి పాఠం ఉంది. అందులో తాపీ మేస్త్రి ఇంటిని ఎలా నిర్మిస్తారు, ఏ పనిముట్లు వాడతారో పాఠం చెప్పారు. అయితే, విద్యార్థులకి మరింతగా విషయావగాహన పెంచేందుకు తాపీమేస్త్రీ సూరిబాబుతో పాఠం చెప్పించారు. నిర్మాణాలను ఏ పనిముట్లతో ఎలా చేపడతారో ప్రయోగాత్మకంగా వివరించారు. ఇతర వృత్తిదారులను కూడా తీసుకొచ్చి విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం తాపీమేస్త్రీ సూరిబాబుని సత్కరించారు.

జీవనోపాధి కల్పించాలని ఎంఎల్‌కు వినతి

ప్రజాశక్తి - తాళ్లపూడి

తమకు జీవనోపాధిని కల్పించాలంటూ తాళ్లపూడి, ప్రక్కిలంక, తాడిపూడి గ్రామాలకు చెందిన పడవ కార్మికులు సోమవారం కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. తాము ఉపాధి లేక నానా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గత ప్రభుత్వం తమని టిడిపి పార్టీ వర్గీయులుగా గుర్తించి ఇసుక ర్యాంపుల్లోకి రానివ్వలేదన్నారు. ఇప్పుడు పార్టీ అధికారంలోకొచ్చినా తమకి ఇబ్బందులు తప్పట్లేదని తెలిపారు. జీవనోపాధి కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రభుత్వన్ని నిర్ణయంతోనే ఇసుక తవ్వకాలకు అవకాశం కలుగుతుందని కార్మికులకు చెప్పారు.



సమస్యను ఎంఎల్‌కు వివరిస్తున్న పడవ కార్మికులు

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని వేగాయమ్మ పేటకు చెందిన గుత్తుల రమ్యశ్రీ (24) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన రమ్యశ్రీకి వేగాయమ్మ పేటకు చెందిన గుత్తుల రాజుతో వివాహం అయ్యింది. వారికి ఒక బాబు ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన మేడిశెట్టి దుర్గా వరప్రసాద్‌తో చనువుగా ఉంటూ ఇంటిలోని బంగారం అతడికి ఇచ్చివేసింది. విషయం తెలిసిన భర్త, తండ్రి నిలదీయడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై ఆమె తండ్రి అనసూరి గనిరాజు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తొండంగి

అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగిన ఒక వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని శృంగ వృక్షం గ్రామానికి చెందిన బోయిన బాబూరావు(31) తన పొలంలో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని కుటుంబ సభ్యులు తునిలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం అతనిని కాకినాడ మరో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

163 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలోని సోమవరం గ్రామంలో 163 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు కిర్లంపూడి ఎస్‌ఐ జి.సతీష్ తెలిపారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో సోమవరం గ్రామంలో తనిఖీలు నిర్వహించగా వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న గూడ్స్ వాహనాన్ని తనిఖీ చేయగా 163 కేజీల గంజాయిని గుర్తించినట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. విశాఖ ఏజెన్సీ నుంచి చెన్నైలోని గుమ్మిడిపొండి గ్రామానికి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వీరిని ప్రత్తిపాడు కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 8 మందికి రూ.10 వేలు చొప్పున మెజిస్ట్రేట్ కోర్టు జరిమానా విధించినట్లు సిఐ సూర్య అప్పారావు తెలిపారు. ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలతోపాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

10 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని జె.కొత్తూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన దాడుల్లో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక వ్యక్తి నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా 8 మంది సారా ముద్దాయిలను గండేపల్లి తహాశీల్దార్ కోర్టులో బైండోవర్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని రామేశంపేటలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్ వస్తున్న వారిని వ్యాన్ ఢీకొనడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగపతినగరం గ్రామానికి చెందిన తాటిపాక గంగరాజు(28) భార్య, పిల్లలతో రంగంపేట గ్రామంలోని కోళ్ల ఫారంలో నివాసం ఉంటున్నాడు. మధ్యాహ్నం తన కుమారుడు అనిల్‌ను ఆనూరు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా రామేశ్వరంపేట వైపు వస్తున్న వ్యాన్ ఢీ కొట్టింది. ద్విచక్రవాహనంపై ఉన్న బాలుడు రోడ్డు పక్కకు పడిపోగా గంగరాజు తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గంగరాజు భార్య సునీత ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివ నాగబాబు తెలిపారు.

ఆటో బోల్తా
తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-కె.గంగవరం

మండలంలోని ఎర్ర పోతవరం, శివల మెయిన్ రోడ్డుపై సోమవారం ప్రయాణికులతో వెళుతున్న ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. మెయిన్ రోడ్డుపై రైతులు ధాన్యం ఆర బెట్టుకున్నారు. ధాన్యం రాశులు తప్పించుకుంటూ వెళ్లిన ఆటో ప్రయాణికులతో బోల్తా పడింది. చిన్న పిల్లలతో పాటు పదిమంది ప్రయాణికులు ఉన్న ఆటో బోల్తా పడిన వెంటనే అక్కడే ఉన్న వ్యవసాయ కూలీలు పరుగున వెళ్లి ప్రయాణికులను బయటకు తీసి ఆటోను తీశారు. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు మినహా ఎవరికీ ఏ విధమైన ప్రమాదం జరగలేదు. రైతులు పెద్ద ఎత్తున తొలకరి ధాన్యాన్ని మెయిన్ రోడ్లపై ఎండబెట్టడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనాలకు దారి విడిచిపెట్టి ధాన్యం ఎండ పెట్టుకోవాలని పలువురు కోరుతున్నారు.

ముగ్గురు సారా విక్రేతల అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలమూరు, మండపేట మండలాల్లో నాటు సారా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ సిఐ డి.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మడికి, బడుగువానిలంక, మండపేట మండలంలోని కేశవరం గ్రామాల్లో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో మడికికి చెందిన మార్గాన దుర్గారావు, బడుగువానిలంకకు చెందిన మారిశెట్టి లక్ష్మణరావు, కేశవరానికి చెందిన కడగల రాముడును అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మొత్తం 35 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. ఈ మేరకు సిఐ నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదానీని కోటీశ్వరునిగా చేసిన ఘనత మోడీదే...

ప్రజాశక్తి - కడియం

గుజరాత్ రాష్ట్రానికి చెందిన సామాన్య మానవుడిగా ఉన్న ఆదానీని ప్రపంచంలోనే కోటీశ్వరుని చేసిన ఘనత నరేంద్ర మోడీకే దక్కుతుందని, ఆయన బినామీగా ఉన్న అదానీ డీల్ వ్యవహారంలో జగన్ తప్పించుకోవడం అసాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టికె.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. కడియం మండలం కడియపులంకలో సోమవారం జరిగిన రాజమహేంద్రవరం రూరల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి తడాల కొండరాజు బాధ్యతలు స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 29న విశాఖకు వస్తున్న నరేంద్ర మోడీ వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను నిలిపేస్తున్నట్టు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పోలవరం ప్రాజెక్టు ఎప్పటి పూర్తవుతుందో చెప్పాలన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రకటన చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తానని, అమరావతిని అభివృద్ధి చేస్తానని వెంకటేశ్వర స్వామి సాక్షిగా ప్రకటన చేసినా ఇప్పటివరకు ఒక అడుగు కూడా ముందుకు పడలేదని విమర్శించారు. ఇప్పటికైనా మాయమాటలు ఆపాలన్నారు. అనంతరం పిసిసి ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మోత శారదతో కలిసి బుర్రిలంకలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో డాక్టర్ వడియార్, డాక్టర్ శ్రీనివాస్, పిఎస్ రాజు, నల్లా వీర్రాజు, పాటంశెట్టి చిన్నమహాలక్ష్మి నాయుడు, తాడాల రవి, ఎ.వెంకటేశ్వరరావు, తాడాల రాజు, తాడాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వేశరరెడ్డి

చేనేత ప్రదర్శనను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పిజిఆర్ఎస్ కార్యక్రమం సందర్భంగా జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తుల ప్రదర్శనను కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రూ.1,830 విలువైన గల చేనేత చీరను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ప్రోత్సహించడం ద్వారా లక్షలాది మంది కార్మికులకు జీవనోపాధిని చూపించొచ్చన్నారు. తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపంగా నిలిచే చేనేత వస్త్రాల వినియోగాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు వారంలో ఒక రోజు తప్పనిసరిగా చేనేత వస్త్రాలను ధరించాలన్నారు. చేనేత, జౌళి శాఖ ఉత్పత్తుల మార్కెట్ సౌకర్యాన్ని మరింత పెంచుకునేందుకు డిజిటల్ లావాదేవీలను పెంచుకోవాలన్నారు. ఎంపిక చేసిన వస్త్రాలపై 30 శాతం రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెసి ఎస్.చిన్నరాముడు, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు పెద్దిరాజు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రామ్మూర్తి నాయుడు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

చంద్రగిరి మాజీ ఎంఎల్ఎ, స్వర్ణాంధ్ర సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నారా రామ్మూర్తి నాయుడు మరణం తీరని లోటని స్వర్ణాంధ్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గుబ్బల రాంబాబు అన్నారు. సోమవారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా నారావారిపల్లెలో రామ్మూర్తి నాయుడు కుటుంబ సభ్యులను రాంబాబు మిత్ర బృందంతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి నాయుడు చేతుల మీదుగా ప్రారంభించబడిన స్వర్ణాంధ్ర సేవా సంస్థ గత 27 సంవత్సరాలుగా సమాజానికి చేస్తున్న సేవలను వారి కుటుంబ సభ్యులకు, కుమారులు సినీ హీరో నారా రోహిత్, నారా గిరీష్, రామ్మూర్తి నాయుడు భార్య ఇందిరలకు వివరించారు. రామ్మూర్తి నాయుడు ప్రోత్సాహం, సహకారం స్వర్ణాంధ్ర సేవ సంస్థ అభివద్ధిలో ఎంతగానో ఉందని తెలిపారు. రామ్మూర్తి నాయుడు కుటుంబ సభ్యులు భవిష్యత్తులో స్వర్ణాంధ్ర సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర వ్యవస్థాపకులు పడాల రామిరెడ్డి ,నార్ని వంశీ, తిరుపతి ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఆర్ఆర్.రెడ్డి, సాయికృష్ణ, సారథి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు చాగల్లు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - చాగల్లు

అండర్ - 14 జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆర్.ప్రవల్లిక ఎంపికైందని పీడీ జె.విజయలక్ష్మి తెలిపారు. అనంతపురం జిల్లా హిందూపూర్‌లో సెప్టెంబర్25 నుంచి 26వరకూ ఎస్‌జిఎఫ్ అండర్-14 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రవల్లిక పాల్గొంది. మంచి ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని పీడీ తెలిపారు. ఇంతవరకు చాగల్లు హైస్కూల్ నుంచి బాలికల ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎవరూ ఎంపిక కాలేదన్నారు. ఇదే మొదటి సారి అని తెలిపారు. ప్రవల్లిక ఎంపిక పట్ల ఇన్‌ఛార్జి హెచ్ఎం ఆర్‌వి.ప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ గోపాలకష్ణ, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రవల్లికు ఎమ్‌డి నఫీజ్ ఆర్థిక సాయం అందించారు.

యానాం వార్తలు

రీజెన్సీ విద్యార్థిని ఘనవిజయం

ప్రజాశక్తి - యానాం

రామచంద్రాపురంలో నిర్వహించిన కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో స్థానిక మెట్టకూరు రీజెన్సీ స్కూల్ విద్యార్థిని నాగభట్ల వెంకటపద్మజభారతి ఘన విజయం సాధించి వెండి పతకాన్ని కైవసం చేసుకున్నట్లు పాఠశాల హెచ్ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాదరావు సోమవారం తెలిపారు. విద్యార్థిని పద్మజ భారతి ఏడవ తరగతి చదువుతుందని వివరించారు. ఈ సందర్భంగా రీజెన్సీ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జిఎన్.నాయుడు, సత్యేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.



చెక్కును అందిస్తున్న మునిస్వామి

మృతుని కుటుంబానికి రూ.5 లక్షల మంజూరు

ప్రజాశక్తి - యానాం

ఇటీవల ఆటో ప్రమాదంలో మృతి చెందిన సంగాడి వెంకట నరసింహస్వామి కుటుంబానికి పుదుచ్చేరి ప్రభుత్వం పిఎం మత్స్య సంపద యోజన పథకం ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు మత్స్యశాఖ అధికారి డి.గొంతియ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి భార్య సంగాడి కాసురత్నంకు మంజూరు పత్రాన్ని ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి చేతుల మీదుగా అందించారు.

3న యానాంలో యువ ఉత్సవ్

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యం లో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని డిసెంబర్ 3న నిర్వహించనున్నట్టు జిల్లా యువజన అధికారి తిర్రి గోపి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవ్ కార్యక్రమాన్ని స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో జరుగుతుందన్నారు. యువ ఉత్సవ్‌లో ఇండియాఏ 2047 అనే అంశంపై పెయింటింగ్, కవిత్వాలు, మొబైల్ ఫొటోగ్రఫీ, డిక్లేమసిన్, విభాగాలలో వ్యక్తిగత పోటీలు, అలాగే కల్చరల్ ట్రెడిషనల్ ఫోక్ (గ్రూప్), సైన్స్ ఎక్జిబిషన్ మేళా పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులు అందించనున్నట్టు తెలిపారు. యానాంలోని యువత పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని కోరారు. యువ ఉత్సవ్‌లో పేర్లు నమోదు చేసుకోవడానికి 9700515436, 7095466771 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మెప్మా ఆధ్వర్యాన ఎంఎల్ఎ దాట్లకు సత్కారం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

అసెంబ్లీ విప్‌గా నియమితులైన ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజును నగర పంచాయతి మెప్మా ఆధ్వర్యాన సోమవారం ఘనంగా సత్కరించారు. మురమళ్ల క్యాంప్ కార్యాలయంలో మెప్మా మహిళలు ఎంఎల్ఎ సుబ్బరాజును కలిసి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకుడు రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ మాట్లాడుతూ అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్న ఎంఎల్ఎ సుబ్బరాజు విప్‌గా ఎంపిక కావడం నియోజకవర్గానికి దక్కిన గౌరవమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పిల్లి నాగరాజు విళ్ల వీరాస్వామి నాయుడు, గొల్లపల్లి గోపి, నగర పంచాయతి కమిషనర్ రవి వర్మ, మేనేజర్ నూకరాజు, ఎఐ సుధాకర్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ భాస్కర్ పాల్గొన్నారు.

వన సమారాధనలో ఎంఎల్ఎ బండారు

ప్రజాశక్తి-రావులపాలెం

మండల పరిధిలోని పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకియమ్మ అన్నదాన సత్రం వన సమారాధనలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు సోమవారం పాల్గొన్నారు. ఆయన వన భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సత్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారం, నగదు బహుమతులు, పదవతరగతి విద్యార్థులకు పుస్తకాలు, వృద్ధులకు దుప్పట్లను ఎంఎల్ఎ అందజేశారు. వన సమారాధనలో వందలాది మందికి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్, వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గంధం అన్నవరం, గోపిశెట్టి సత్తిబాబు, అల్లూరి కృష్ణంరాజు, కుడుపూడి వెంకటేశ్వర్లు, వీటి రాజు, చిలకమర్తి శివ కృష్ణ, వీటి రాంబాబు, ఇఒ మీసాల రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రావులపాలెం

స్థానిక అరటి మార్కెట్ యార్డులోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను ఆర్‌డిఒ శ్రీకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం రావులపాలెంలో ఆర్‌డిఒ పర్యటించారు. ఆత్రేయపురం, కొత్తపేట, రావులపాలెం మండలాలకు పంపిణీ చేసే మార్కెట్ యార్డు గొడౌన్‌లోని బియ్యం, పప్పులు, వంట నూనె స్టాక్ పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ముక్తేశ్వరరావు, ఎంఎస్‌ఒ, ఆర్‌ఐ సుజాత, గొడౌన్ ఇన్‌ఛార్జి సిహెచ్.సతీష్, టెక్నికల్ అసిస్టెంట్ వై.నాని, అప్పలరాజు పాల్గొన్నారు.

దారి మధ్యలో స్తంభాలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-అమలాపురం

రూరల్ మండలం బండారులంక పంచాయతీ కందులపాడు కాలనీలో ప్రధాన రోడ్డు మార్గంలో కొంత మంది అక్రమంగా పాతిన ఇనుప స్తంభాలు తొలగించాలని గ్రామస్తులు సోమవారం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావును కలిసి వినతి పత్రం అందించారు. అనారోగ్యానికి గురైన వారిని ఆసుపత్రి తీసుకువెళ్లడానికి కనీసం అంబులెన్స్ కాలనీలోకి రాకపోవడం వల్ల చేతులపై మోసుకుని వెళుతున్నట్టు వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరి వ్యక్తిగత వివాదం వల్ల మొత్తం కాలనీ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. అనేకసార్లు అధికారులకు మొర పెట్టుకున్నప్పటికి సిసి రోడ్డు మధ్యలో వేసిన ఇనుప స్తంభాలు తొలగించలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి అమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొలమూరి మోహన్ బాబు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, గ్రామస్తులు మంజుల, పద్మ, శోభ, వెంకటలక్ష్మి, రాణి సూర్య లక్ష్మి రుక్మిణి పాల్గొన్నారు.

26న లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యాన సదస్సు

ప్రజాశక్తి-అమలాపురం

ఈ నెల 26న మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నల్ల వంతెన వద్ద ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్యక్షులు వి.నరేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎపి స్టేట్ లీగల్ అథారిటీ వారి సూచనల మేరకు తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవల ప్రాధికార సంస్థ ప్రొసీడింగ్ ప్రకారం, అమలాపురంలోని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, ఈ నెల 26న న్యాయ అక్షరాస్యత శిబిరాన్ని నిర్వహించాలని ప్రతిపాదించిందన్నారు.

ఫీజుల కోసం ఇబ్బంది పెడితే చర్యలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

ఫీజులు చెల్లించలేదనే కారణంగా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. ఫీజు చెల్లించలేదనే కారణంతో తరగతుల నుంచి బయటకు పంపేయడం, హాల్ టికెట్లు ఇవ్వక పోవడం,చ పరీక్షలు లేదా ప్రాక్టికల్ ఎగ్జామ్స్ రాయనివ్వకుండా చేస్తే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాలోని కళాశాలల ప్రిన్సిపల్స్‌కు షెడ్యూల్డు కులాలు, తెగలు, వెనుకబడిన తరగతుల, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల, మైనార్టీ తరగతులకు చెందిన ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ ఆపై చదువుతున్న విద్యార్థులకు సంబంధించి 2024-25 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం కొన్ని మార్గ దర్శకాలను విడుదల చేసిందన్నారు. వీటి ప్రకారం ప్రభుత్వం నుంచి ఉపకార వేతనానికి అర్హత గల విద్యార్థులను ఫీజు చెల్లించలేదనే కారణంతో ఇబ్బందులకు గురిచేస్తే సంబంధిత కళాశాలపై చర్యలు తీసుకుంటామని మార్గదర్శకాల్లో స్పష్టంగా పేర్కొన్నారన్నారు.

జడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు బాల్స్ అందజేత

ప్రజాశక్తి - చాగల్లు

ఊనగట్ల జై భీమ్ యూత్ చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులకి వివిధ రకాల 20 బాల్స్ సోమవారం అందజేశారు. విద్యార్థులు వివిధ క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనందున వారిని ప్రోత్సహించేందుకు జై భీమ్ యూత్ వీటిని అందించింది. రూ.15 వేల విలువైన బాల్స్‌ను పాఠశాల యోగా టీచర్‌కు అందించారు. ఈ సందర్భంగా పీడీ విజయలక్ష్మి జై భీమ్ యూత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



కాలువ గట్టును ఆనుకు వేసినబొప్పాయి తోట

కాలువగట్టుపై అనధికార సాగు
ఏటిగట్టుకు పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని శెట్టిపేట-కాకరపర్రు కెనాల్, దమ్మెన్ను గ్రామానికి ఆవలి గట్టున ఇరిగేషన్ భూమిలో అనధికార సాగు జరుగుతోంది. గట్టున సుమారు 400 మీటర్ల పొడవున్న బొప్పాయి సాగును అనధికారికంగా చేపడుతున్నారు. దీనిపై సదరు రైతు తరఫు ప్రతినిధి మాట్లాడుతూ బొప్పాయి తోట వేసుకోవడం నిజమేనని, అది ప్రజలకు పంచి పెట్టేందుకు మాత్రమే అంటూ వెనకేసుకొస్తున్నాడు. పైగా ఆ స్థలాన్ని శుభ్రం చేస్తున్నామే తప్ప కబ్జాచేయడం లేదని చెబుతున్నారు. గత సంవత్సరం ఈ ప్రదేశంలోనే కాలువకు గండి పడి, అనేక ఎకరాలు నీట మునిగాయి. ఇక్కడ గట్టును ఆక్రమణలను తొలగించి గట్టును పటిష్టం చేయాల్సిన అధికారులు కనీసం అటువైపు తొంగి కూడా చూడట్లేదు. అధికారుల ఉదాసీనతపైనా పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

శివాలయాల్లో కార్తీక సందడి

ప్రజాశక్తి- కడియం

కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో శివాలయాల్లో యాత్రికుల సందడి నెలకొంది. మండలంలోని కడియపులంక, వీరవరం, దుళ్ల, మురమండ, జేగురుపాడు, మాధవరాయుడుపాలెం గ్రామాల్లోని శివాలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. కడియంలో ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబక సమేత మల్లేశ్వర స్వామి ఆలయానికి తెల్లవారు జాము నుంచే యాత్రికులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు.

సబ్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా సోమవారం సత్యవాడ జడ్‌పి ఉన్నత పాఠశాల ఒకేషనల్ ట్రైనర్ సిహెచ్.కుశలత ఆధ్వర్యంలో 9,10 తరగతి విద్యార్థులకు పశ్చిమగోదావరి జిల్లా దువ్వలోని ఎపిఇపిడిసిఎల్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో షిఫ్ట్ ఆపరేటర్ బి.శ్రీధర్ ట్రాన్స్ ఫార్మర్ ఫంక్షనింగ్, 33/11 కెవి విద్యుత్, ఫీడర్స్, బేకర్స్ పనిచేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇండస్ట్రియల్ టూర్ నిర్వహించిన ఉపాధ్యాయులను హెచ్ఎం బి.సూర్యకాంతం ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల, క్లాస్ రూమ్‌లో కేవలం పుస్తకాలు చదవడం కాకుండా, ప్రాక్టికల్‌గా చూసి నేర్చుకోవడం ద్వారా అవగాహన పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామారావు పాల్గొన్నారు..



టిడిపి సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి - తాళ్లపూడి

టిడిపి తాళ్లపూడి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు సామిల్లు వద్ద సోమవారం పార్టీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అన్ని సమయాల్లోనూ ప్రజా సంక్షేమంతో పాటు పార్టీ నాయకులు కార్యకర్తలకి అండగా ఉంటూ పార్టీని నడిపించారన్నారు. సభ్యత్వ నమోదు తోపాటు ప్రజా సమస్యలపైనా నాయకులు దృష్టి సారించాలన్నారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు భీమా సౌకర్యంతో పాటు కుటుంబంలో పిల్లల చదువుకు సహకారం అందించే విధంగా ప్రయోజనాలు చేకూరేలా పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు. మండలంలోని ప్రక్కిలంక గ్రామానికి చెందిన డేరా ముసలయ్య అనే యువకునికి ఎంఎల్ఎ పార్టీ సభ్యత్వం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కోట్నీస్, ప్రక్కిలంకకు చెందిన నాయకులు హనుమంతరావు, పైడిమెట్టకు చెందిన నారాయణపురపు పోసియ్య పాల్గొన్నారు.

